క్లుప్తంగా

వైభవంగా శివపార్వతుల కల్యాణం



కొత్తకోట రూరల్: మండలంలోని కానాయపల్లి స్టేజీ సమీపంలో గల దత్తకోటిలింగేశ్వరస్వామి ఆలయ 17వ వార్షిక బ్రహ్మోత్సవాలు నాలుగు రోజుల పాటు వైభవంగా నిర్వహించగా శనివారం ముగిశాయి. చివరిరోజు ఆదిదంపతులైన శివపార్వతుల కల్యాణోత్సవాన్ని మంగళ వాయిద్యాలతో అర్చకులు వేదమంత్రాల మధ్య అశేష భక్తజన సందోహం తిలకిస్తుండగా అంగరంగా వైభవంగా జరిపించారు. ఆలయం శివపార్వతుల నామస్మరణంతో మార్మోగింది. ఆలయానికి వచ్చిన భక్తులకు ఆలయ నిర్వాహకులు తీర్థప్రసాదాలు అందజేయడంతో పాటు అన్నదానం చేశారు.

జీహెచ్ఎంకు సన్మానం



పాన్‌గల్: మండలంలోని రేమద్దుల ఉన్నత పాఠశాలలో నూతన బాధ్యతలు స్వీకరించిన జీహెచ్ఎం జమీల్‌కు శనివారం సీపీఎం, ఎస్ఎఫ్ఐ నాయకులు శాలువాలతో సన్మానించారు. విద్యార్థుల విద్యా అభివృద్ధికి తోడ్పాడాలని వారు జీహెచ్ఎంకు సూచించారు. పాఠశాల అభివృద్ధికి తమ వంతు సహకారం ఎప్పుడు ఉంటుందన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు భగత్, వెంకటయ్య, ఖాజా, ఎస్ఎఫ్ఐ నాయకుడు గిరిబాబు పాల్గొన్నారు.

విద్యార్థుల సంఖ్య పెంచేందుకు కృషి



పాన్‌గల్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్ అన్నారు. శనివారం మండలంలోని దావాజిపల్లి యూపీఎస్ పాఠశాలను ప్రార్థన సమయంలో సందర్శించారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ప్రభుత్వం కల్పిస్తున్న వసతులను వివరిస్తూ తల్లిదండ్రులకు భరోసా కల్పించాలన్నారు. గ్రామంలోని ప్రతి విద్యార్థి ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివే విధంగా చూడాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం బద్రూనాయక్ పాల్గొన్నారు.

మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించండి



కొత్తకోట: వనపర్తి జిల్లా నూతన కలెక్టర్‌గా బాధ్యతలు తీసుకున్న ఆదర్శ్ సురభిని కొత్తకోట మున్సిపల్ చైర్‌పర్సన్ పి.సుఖేశిని శనివారం మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందించి అభినందనలు తెలిపారు. కొత్తకోట మున్సిపాలిటీలో జరుగుతున్న అభివృద్ధికి తోడ్పాటును అందించాలని, పట్టణంలో సీసీ రోడ్లు, డ్రెయినేజీలు, ఇంటిగ్రేటెడ్ మార్కెట్ పనులు 70శాతం పూర్తయ్యాయని, మిగిలిన 30శాతం పనులకు పూర్తి చేసేందుకు సహకారం అందించాలని కలెక్టర్‌ను కోరారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు పి.విశ్వేశ్వర్, లచ్చన్నగారి రవీందర్ రెడ్డి, వినోద్‌సాగర్ తదితరులు ఉన్నారు.

పెబ్బేరు రూరల్: మండలానికి చెందిన కాంగ్రెస్ నాయకులు కలెక్టరేట్‌లో కలెక్టర్ ఆదర్శ్ సురభిని కలిసి శాలువా, పూల బొకే ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో అక్కి శ్రీనివాస్‌గౌడ్, సురేందర్‌గౌడ్, వెంకటేష్‌సాగర్, వీరస్వామి, కోటేశ్వర్‌గౌడ్, రాము ఉన్నారు.

మిషన్ భగీరథ పైపులైన్‌కు మరమ్మతు

అమరచింత: నందిమళ్ల ఎక్స్‌రోడ్ గ్రామ పంచాయతీ సమీపంలో పగిలిపోయిన మిషన్ భగీరథ పైపులైన్‌కు సిబ్బంది శనివారం మరమ్మతు చేపట్టారు. పైపులైన్‌కు పగుళ్లు రావడంతో నీరంతా అక్కడే లీకేజీ అవుతోందని ప్రజలు మిషన్ భగీరథ సిబ్బందికి సమాచారం అందించారు. స్పందించిన సిబ్బంది పైపులైన్ వద్ద సిమెంట్‌తో మరమ్మతు చేశారు. దీంతో నందిమళ్ల ఎక్స్‌రోడ్‌తో పాటు కిష్టంపల్లి, ఈర్లదిన్నె, చింతరెడ్డిపల్లి, మిట్టనందిమళ్ల గ్రామాల ప్రజలకు తాగునీటి కష్టాలు తప్పాయి.

సెల్‌ఫోన్ అప్పగింత

ఆత్మకూర్: సీఈఐఆర్ పోర్టల్ ద్వారా పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను రికవరీ చేసి శనివారం బాధితుడికి అప్పగించినట్లు ఎస్ఐ నరేందర్ తెలిపారు. ఆత్మకూర్ మండలంలోని మోట్లంపల్లికి చెందిన కావలి రాజు ఈ నెల 13న ఆరేపల్లి నుంచి స్వగ్రామానికి బైక్‌పై వెళ్తుండగా సెల్‌ఫోన్ పడిపోయింది. బాధితుడి ఫిర్యాదు మేరకు సీఈఐఆర్ పోర్టల్ ద్వారా సెల్‌ఫోన్ ఆచూకీని కనుక్కొని రికవరీ చేశారు.

అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి

- మంత్రి జూపల్లి కృష్ణారావు



బునాదిపురం సమీపంలో హైలెవల్ వంతెననను ప్రారంభిస్తున్న మంత్రి జూపల్లి, ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, కలెక్టర్ ఆదర్శ్ సురభి తదితరులు

పెబ్బేరు రూరల్: రాజ్యాంగ నిర్మాత డా, బాబాసాహెబ్ అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా ముందుకు సాగాలని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు కోరారు. శనివారం మండలంలోని బునాదిపురం శివారులో రూ 2.40 కోట్లతో నిర్మించిన హైలెవల్ వంతెనను కలెక్టర్ ఆదర్శ్ సురభి, ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్‌తో కలిసి ప్రారంభించారు. అనంతరం సూగూరులో డా. అంబేడ్కర్ కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించి అక్కడే ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడారు. అంబేడ్కర్ విగ్రహాన్ని చూస్తూ స్ఫూర్తి పొందాలని సూచించారు. సమాజంలో గౌరవం, ఆర్థిక స్వావలంబన సాధించడానికి విద్య ఒకటే మార్గమని చెప్పారు. పేదలు సైతం వారి పిల్లలను ప్రైవేట్ పాఠశాలల్లో చదివించి రూ.లక్షలు ఖర్చుచేస్తూ ఆర్థికంగా నష్టపోతున్నారన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నిష్ణాతులైన ఉపాధ్యాయులు ఉండటంతో నాణ్యమైన విద్య అందుతుందని.. ప్రైవేటు దీటుగా మౌలిక వసతులు కల్పిస్తున్నామని చేర్పించాలని సూచించారు. ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం బడుగు, బలహీనవర్గాలకు అండగా ఉంటుందన్నారు. గ్రామంలో మౌలిక వసతులు, నల్లచెరువు కట్ట తదితర సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం విగ్రహ దాతలను సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ ఆవుల శైలజ, జెడ్పీటీసీ సభ్యురాలు పద్మ, మాజీ సర్పంచ్‌లు వెంకటస్వామి, వెంకటేష్, వెంకటస్వామి, గోవింద్‌నాయుడు, కాంగ్రెస్ నాయకులు అక్కి శ్రీనివాసులుగౌడ్, ఆవుల కురుమూర్తి, సురేందర్‌గౌడ్, రాజశేఖర్‌గౌడ్, నర్సింహ, బుచ్చన్న యాదవ్, వెంకటేష్‌సాగర్, వీరస్వామి పాల్గొన్నారు.

పారదర్శక పాలన అందిస్తాం

మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలోని సమావేశ మందిరంలో శనివారం ఎంపీపీ ఆవుల శైలజ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు జిల్లెల చిన్నారెడ్డి, జెడ్పీ చైర్మన్ లోక్‌నాథ్ రెడ్డి, ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పారదర్శక పాలన అందిచాలని అధికారులకు సూచించారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో 40 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్మన్, జెడ్పీటీసీ పద్మ, ఎంపీపీ ఆవుల శైలజ, ఎంపీటీసీల పదవి కాలం ముగుస్తుడంతో మంత్రి, ఎమ్మెల్యే వారిని శాలువా, పూలమాలతో సన్మానించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఓ నాగేంద్ర, ఎంపీడీఓ రవీందర్, తహసీల్దార్ లక్ష్మి పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం



అమ్మవారి తాలిబొట్టుకు నమస్కరిస్తున్న భక్తులు



కల్యాణ వేడుకను నిర్వహిస్తున్న వేదపండితుడు

అమరచింత: పట్టణంలోని బీసీ కాలనీలో వెలసిన శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి కల్యాణం కనులపండువగా కొనసాగింది. శనివారం వేకువజాము నుంచే ఆలయంలో ప్రత్యేక హోమం నిర్వహించి పూజలు జరిపించారు. టీటీడీ బ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు కొల్లూరి భీమాచారి ఆధ్వర్యంలో వేదమంత్రోచ్ఛరణల మధ్య స్వామివారి కల్యాణం నిర్వహించారు. టీటీడీ ధర్మ ప్రచారకులు డాక్టర్ ఉత్తరపల్లి రామాచార్యులు, జిల్లాపురం రామకృష్ణారెడ్డి బృందం ఆలపించిన అన్నమాచార్య కీర్తనలతో భక్తజనం గోవిందనామస్మరణలో తేలియాడారు. భక్తులకు అన్నప్రసాదం అందించారు. కార్యక్రమంలో ఆయల కమిటీ సభ్యులు పారుపల్లి చింతన్న తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

పాలమూరు: సుశ్రుత ప్రజా వైద్యశాల ఆధ్వర్యంలో ఆదివారం సుశ్రుత ఆస్పత్రిలో పిల్లలు పుట్టాలని కోరుకునే వారి కోసం ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు వైద్యురాలు పి.ప్రతిభ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఈ శిబిరంలో సెమెన్ ఎనాలసిస్, అల్ట్రాసౌండ్, డాక్టర్ కన్సల్టేషన్ ఉచితంగా ఉంటుందని పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పిల్లలు కావాలనుకునే దంపతులు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సంతానం కోసం అన్ని రకాల వైద్యసేవలు సుశ్రుతలో అందుబాటులో ఉన్నాయని, అత్యాధునిక వైద్యసేవలు పొందవచ్చునని సూచించారు. ఇతర వివరాల కోసం 88852 21877, 9866 457501 నంబర్లకు సంప్రదించాలని తెలిపారు.

ఐఎన్‌టీయూసీ జిల్లా సమావేశం

అమరచింత: ఐఎన్‌టీయూసీ జిల్లా స్థాయి సమీక్ష సమావేశాన్ని ఆదివారం జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ క్యాంప్ కార్యాలయం, నందిహిల్స్‌లో నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు మాధవ రెడ్డి, మహిళా అధ్యక్షురాలు గిరిజ తెలిపారు. ఈసమీక్ష సమావేశానికి ఎమ్మెల్యే మేఘారెడ్డి, ఐఎన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ మురహరి హాజరవుతున్నా రని పేర్కొన్నారు. జిల్లావ్యాప్తంగా ఆయా గ్రామాల నుంచి కార్మికులు, కర్షకులు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. అమరచింత మండల అధ్యక్షుడు ప్రభుదాస్ పాల్గొన్నారు.

రైతు శ్రేయస్సే ప్రభుత్వ ధ్యేయం



హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు, కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి



ఆత్మకూర్‌లో..

కొత్తకోట: ఏరువాక పౌర్ణమి శుభ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి రూ.2లక్షల రైతు రుణమాఫీపై స్పష్టత ఇవ్వడం ద్వారా రైతులు, కాంగ్రెస్ నాయకులు కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ రైతులు తీసుకున్న రూ.2లక్షల రుణాలన్నీ ఆగస్టు 15లోపు ఒకే విడతలో మాఫీ చేస్తామని హర్షం వ్యక్తం చేశారు. రైతు సంక్షేమాన్ని గత ప్రభుత్వం పూర్తిగా గాలికి వదిలేసిందని, కానీ రేవంత్‌రెడ్డి ప్రభుత్వం రూ.31 వేల కోట్ల రుణాలు మాఫీ చేసేందుకు సిద్ధపడిందని కొనియాడారు. కార్యక్రమంలో దామోదర్‌రెడ్డి, బుచ్చన్న, కొండారెడ్డి, చిన్నయ్య, రాములు, తిరుపతిరెడ్డి, బజార్, కృష్ణయ్య, బాలరాజు ఉన్నారు.

కొత్తకోట రూరల్: రైతుల అభివృద్ధి, సంక్షేమమే కాంగ్రెస్ లక్ష్యమని ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోయేజ్ అన్నారు. రైతులకు రూ.2లక్షల రుణమాఫీ ఏకకాలంలో చేయడానికి మంత్రివర్గం ఆమోదం తెలుపడంతో హర్షం వ్యక్తం చేశారు. దివంగత నేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పాలనలో రైతులకు రుణమాఫీ ఏకకాలంలో చేశారని, అదే తరహాలో సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ ఏక కాలంలో రుణమాఫీ చేసేందుకు నిర్ణయం తీసుకుందన్నారు. కార్యక్రమంలో ఎల్లంపల్లి నరేందర్‌రెడ్డి, సంద వెంకటేష్ ఉన్నారు.

ఆత్మకూర్: ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు రూ.2లక్షలు రుణమాఫీ చేసేందుకు సిద్ధమైందని మక్తల్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు తులసీరాజ్‌యాదవ్ అన్నారు. శనివారం ఆత్మకూర్‌లోని గాంధీచౌక్‌లో సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం బాణాసంచా కాల్చి మిఠాయిలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో దామోదర్, మహేష్, అశోక్, రమేష్, అబ్దుల్లా, ఆమీర్, మల్లేష్‌యాదవ్, ఆనంద్‌గౌడ్ ఉన్నారు.

అమరచింత: ఎన్నికల మేనిఫెస్టోలో భాగంగా రైతులకు రూ.రెండు లక్షల రుణాలను మాఫీ చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించడంతో శనివారం పట్టణంలో కాంగ్రెస్ నాయకులు సంబురాలు చేసుకున్నారు. కిసాన్‌సెల్ మండల అధ్యక్షుడు లక్ష్మీకాంత్ రెడ్డి, మండల అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో రాజీవ్‌గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వెంకటేశ్వర్‌రెడ్డి, పోసిరిగారి విష్ణు, శ్రీధర్, శ్యాం, సురేష్, విజయ్ పాల్గొన్నారు.

రూ. 2.10లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

కొత్తకోట రూరల్: పెద్దమందడి మండలంలోని పామిరెడ్డిపల్లికి చెందిన కుర్వ బిక్కయ్య భార్య మలమ్మ అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. బాధిత కుటుంబ సభ్యులు సీఎం సహాయనిధి కోసం దరఖాస్తు చేసుకోగా స్థానిక కాంగ్రెస్ నాయకులు విషయాన్ని ఎమ్మెల్యే మేఘారెడ్డి దృష్టికి తీసుకుపోయారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే రూ.2.10లక్షల సీఎం సహాయనిధి చెక్కును మంజూరు చేయించారని మాజీ సర్పంచ్ సిద్ధయ్య, కాంగ్రెస్ నాయకుడు శ్రీశైలం తెలిపారు. చెక్కును బాధిత కుటుంబ సభ్యులకు శనివారం అందజేశారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే మేఘారెడ్డికి, కాంగ్రెస్ నాయకులు కృతజ్ఞతలు తెలియజేశారు.

జూనియర్ అసిస్టెంట్‌కు సన్మానం

పెబ్బేరు రూరల్: పెబ్బేరు తహసీల్దార్ కార్యాలయంలో మందడి వెంకటేష్ అటెండర్‌గా 2018 నుంచి 2024 వరకు పనిచేశాడు. ఈయన జూనియర్ అసిస్టెంట్‌గా పదోన్నతిపై చిన్నంబావి మండలానికి బదిలీపై వెళ్తున్నాడు. శనివారం తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సన్మాన కార్యాక్రమంలో తహసీల్దార్ లక్ష్మి, సిబ్బంది మందడి వెంకటేష్‌ను శాలువా, పూలమాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ లక్ష్మీకాంత్, ఆర్ఐ రాఘవేంద్ర, సిబ్బంది శ్రీను, మదన్‌మోహన్, కృష్ణా, మురళి, సురేష్, పరమేష్, వంశీ, వెంకటయ్య, సుదర్శన్, మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

సుస్థిర సాగుపై అవగాహన

పెబ్బేరు రూరల్: వ్యవసాయ సాగులో సమగ్రమైన పోషణ యాజమాన్య చర్యలు చేపట్టడంతో మంచి దిగుబడులు పొందొచ్చని మదనాపురం కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ భవాని అన్నారు. సమగ్ర పోషక యాజమాన్యంతో సుస్థిర వ్యవసాయంపై శనివారం మండలంలోని గుమ్మడంతో పాటు క్లస్టర్ గ్రామాలు తిప్పాయిపల్లి, అయ్యవారిపల్లి రైతులకు అవగాహన కల్పించారు. వానాకాలం పంటలపై రైతులు అవలంబించవలసిన పద్ధతులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు అర్థమయ్యే సులభమైన రీతిలో వివరించారు.

ఘనంగా ఏరువాక పౌర్ణమి వేడుకలు



అమరచింతలో ఎద్దులతో రైతులు, నాయకులు



దుప్పల్లిలో ఎడ్లబండ్ల ఊరేగింపు



ఆత్మకూర్ మండలం మూలమళ్లలో..

ఆత్మకూర్: మండలంలోని పిన్నంచర్ల, మూలమళ్ల, తిప్పుడంపల్లి, ఆరేపల్లి తదితర గ్రామాల్లో శనివారం సాయంత్రం ఏరువాక పౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. వృషభ రాజులను అందంగా ముస్తాబు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించి ఎడ్లబండ్ల పోటీలను నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామాల్లో పండుగ వాతావరణం నెలకొంది. అనంతరం మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీల చేతుల మీదుగా రైతులకు బహుమతులను ప్రదానం చేశారు.

అమరచింత: ఏరువాక పౌర్ణమిని పురస్కరించుకుని మండలంలోని రైతులతో పాటు ప్రజలు పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. పాడి రైతులు తమ వృషభాలను చక్కగా అలంకరించి పూజలను నిర్వహించారు. పట్టణంలో దశమికట్ట వద్ద సాయంత్రం జరిగిన ఏరువాక తాడు లాగు పోటీల్లో తోకలి వెంకటేష్‌కు చెందిన వృషభాలు ఏరువాక తాడును లాగడంతో పోటీలు ముగిశాయి. విజయం సాధించిన వృషభానికి మువ్వలు, శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ, కౌన్సిలర్ మీనుగ లక్ష్మి, బీజేపీ నాయకులు మేర్వరాజు, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

మదనాపురం: మండలంలో శనివారం ఏరువాక పౌర్ణమి పండుగను మండల ప్రజలు ఘనంగా నిర్వహించారు. దుప్పల్లి, కొత్తపల్లి, కొన్నూరు, దంతనూరు, గోపన్‌పేట తదితర గ్రామాల్లో పండుగ వాతావరణం కనిపించింది. ఉదయం నుంచి ఎద్దులకు స్నానాలు చేయించి రంగులు అద్ది పూజలు చేశారు. అనంతరం గ్రామాల్లో ఊరేగింపు నిర్వహించారు. సాయంత్రం వేళల్లో ప్రధాన కూడళ్లలో ఏరువాక తాడు తెంపారు.

అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలి



కదిరెపాడు ఉన్నత పాఠశాలలో పనులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ కోటేశ్వర్

పాన్‌గల్: పాఠశాలల్లో అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా చేపట్టి మరమ్మతు పనులను త్వరగా పూర్తి చేయాలని ఎంపీడీఓ కోటేశ్వర్ అన్నారు. శనివారం మండలంలోని కదిరెపాడు ఉన్నత పాఠశాలలో చేపట్టిన అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆయా పనులను నిబంధనల మేరకు నాణ్యతగా చేపట్టి త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం గ్రామంలోని జీపీ కార్యాలయాన్ని సందర్శించి రికార్డులను తనిఖీ చేశారు. జీపీల్లో చేపట్టిన అభివృద్ధి పనులు, ఖర్చు చేసిన వాటి వివరాలకు సంబంధించిన రికార్డులను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. అనంతరం గ్రామంలోని నర్సరీ, వర్మీ కంపోస్ట్ ఎరువుల తయారీని పరిశీలించారు. లక్ష్యానికి అనుగుణంగా హరితహారం మొక్కలను సిద్ధం చేసుకోవాలన్నారు. పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆయన కార్యదర్శికి సూచించారు. కార్యక్రమంలో జీహెచ్ఎం కృష్ణ, పంచాయతీ కార్యదర్శి, ఫీల్డ్ అసిస్టెంట్ పాల్గొన్నారు.

వక్ఫ్ భూముల అన్యాక్రాంతంపై సర్వే



కొత్తతండా శివారులో వక్ఫ్ భూములను పరిశీలిస్తున్న తహసీల్దార్ చాంద్‌పాషా

అమరచింత: మండలంలోని ఆయా గ్రామాల్లో గల వక్ఫ్ భూములు అన్యాక్రాంతం అవుతున్నాయనే ఆరోపణలపై రెవెన్యూ అధికారులు సర్వే చేపట్టారు. తహసీల్దార్ షేక్ చాంద్‌పాషా ఆధ్వర్యంలో ఆర్ఐ గోపాల్, సర్వేయర్ పాండు కలిసి పట్టణ శివారులోని వక్ఫ్ భూములను సర్వే నంబర్ల ఆధారంగా పంట పొలాల్లోకి వెళ్లి భూ రికార్డులను పరిశీలించారు. ఈసందర్భంగా తహసీల్దార్ చాంద్‌పాషా మాట్లాడుతూ మండలంలోని అమరచింత, నందిమళ్ల, మస్తీపురం, ధర్మాపురం, సింగంపేట గ్రామాల్లో మసీదులు, పీర్ల చావిడీలు, దర్గాల నిర్వహణ కోసం అప్పట్లో అమ్మాపురం సంస్థానదీశురాలు రాణి మహాలక్ష్మీదేవమ్మ ఆయా గ్రామాల్లో సుమారు 72 ఎకరాలు అప్పగించారు. ఆ భూముల్లో పంటలు పండించుకుంటూ వచ్చిన ఆదాయంతో మసీదుల నిర్వహణ, పీర్ల పండుగలను నిర్వహించేవారు. ప్రస్తుతం భూములను అనుభవిస్తున్న వారు ఇతరులకు పట్టాలు చేసి అమ్మడం లేదా వారికి తెలియకుండా ఇతరులు అప్పట్లో పట్టాలు చేసుకోవడం వంటి ఘటనలు చోటుచేసుకున్నాయి. ప్రభుత్వం మార్పుతో మరోమారు వక్ఫ్‌కు సంబంధించిన భూములను గుర్తించి కబ్జాలో ఉన్న వారి నుంచి భూములను స్వాధీనం చేసుకునేందుకు వక్ఫ్ అధికారులు చర్యలు చేపట్టారన్నారు. సర్వే వివరాలను వక్ఫ్ బోర్డ్ అధికారులకు నివేదిస్తున్నామన్నారు.

ఫాంపాండ్‌ను రైతులు సద్వినియోగం చేసుకోవాలి



అన్నారంతండాలో ఫాంపాండ్ నిర్మాణాన్ని పరిశీలిస్తున్న ఏపీఓ కుర్మయ్య

పాన్‌గల్: ఉపాధి హామీ పథకం ద్వారా నిర్మిస్తున్న ఫాంపాండ్‌ను పండ్ల తోటల రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏపీఓ కుర్మయ్య అన్నారు. శనివారం మండలంలోని అన్నారంతండా, రేమద్దుల శివారులో ఉపాధి హామీ పథకం ద్వారా నిర్మిస్తున్న ఫాంపాండ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పండ్ల తోటలు పెంచుతున్న రైతులకు సాగునీరు తక్కువగా ఉంటే ఫాంపాండ్లు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లో పండ్ల తోటలను పెంచుతున్న రైతులు ఫాంపాండ్లు నిర్మించుకునేలా ప్రోత్సహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. 12/12, 25/25 సైజులల్లో ఫాంపాండ్లను నిర్మిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లించాలి

ఆత్మకూర్: ప్రభుత్వ కమ్యూనిటీ హెల్త్‌సెంటర్‌లో పనిచేస్తున్న కార్మికులకు ఏడునెలలుగా వేతనాలు ఇవ్వకపోవడంతో వారు పస్తులు ఉండాల్సిన పరిస్థితి దాపురించిందని తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్, ఏఐటీయూసీ రాష్ట్రకార్యదర్శి సురేష్ అన్నారు. జీఓ 60 ప్రకారం వేతనాలు చెల్లించాలని శనివారం ఆత్మకూర్‌లోని కమ్యూనిటీ హెల్త్‌సెంటర్ వద్ద కార్మికులతో కలిసి నిరసన తెలిపి, వైద్యాధికారి డాక్టర్ వంశీకి వినతిపత్రం అందజేశారు. శానిటేషన్, పేషెంట్ కేర్, సెక్యూరిటీ, సూపర్‌వైజర్ కార్మికులకు జీఓ 60 ప్రకారం రూ.15,600 ఇవ్వాల్సి ఉండగా.. సంబంధిత కాంట్రాక్టర్ వెంకటయ్య, ఏజెన్సీ నిర్వాహకులు కోతలు పెడుతున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో కార్మికులు బాలరాజు, పార్వతమ్మ, నాగమ్మ, సత్తార్, భరత్, మోహినొద్దీన్, చెన్నమ్మ, బాలకిష్టమ్మ, శైలజ, వెంకటేష్, తిరుపతమ్మ, లక్ష్మి, అరుణ్ తదితరులు ఉన్నారు.

పాఠశాలకు టేబుళ్ల వితరణ



ఖిల్లాఘనపురం: సోళీపురం గ్రామానికి చెందిన వేద పండితుడు జ్యోషి గోపాలశర్మ పాఠశాలకు టేబుళ్లు వితరణగా అందజేశారు. గ్రామంలోని ఉన్నత పాఠశాలలో టేబుళ్లు అవసరమని తెలిసి తనవంతుగా రూ.70 వేల విలువ చేసే 10 టేబుళ్లను పాఠశాలకు అందించిన జ్యోషి గోపాలశర్మను పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు శాలువాతో సన్మానించారు. గ్రామంలో గుడిని, బడిని సమానంగా అభివృద్ధి చేసేందుకు నిరంతరం కృషి చేస్తున్న ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

అక్రమంగా కలప తరలిస్తున్న ట్రాక్టర్ల పట్టివేత

ఖిల్లాఘనపురం: ఖిల్లాఘనపురం ఫారెస్టు రేంజ్ పరిధిలో కలపను కొట్టి అక్రమంగా తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకుని కేసునమోదు చేసినట్లు ఫారెస్టు రేంజ్ అధికారి మంజుల తెలిపారు. రేంజ్ పరిధిలోని పామిరెడ్డిపల్లి తండాకు చెందిన చందు ట్రాక్టర్‌లో వనపర్తి సామేల్ చెన్నయ్య అక్రమంగా కలపను తరలిస్తుండగా వెంబడించి పట్టుకున్నట్లు ఆమె తెలిపారు. అదేవిదంగా కమాలొద్దీన్‌పూర్ నుంచి గంజి ఎర్రన్న ట్రాక్టర్‌లో కలపను అక్రమంగా ఖిల్లాఘనపురంలోని ఓ ఇటుక బట్టీకి తరలిస్తుండగా పూర్తి స్థాయి సమాచారంతో పట్టుకున్నట్లు ఆమె చెప్పారు. రెండు ట్రాక్టర్లపై కేసు నమోదు చేశారు. చట్టం ప్రకారం జరిమానా విధించిన తరువాతనే ట్రాక్టర్లను వదిలిపెడతామని తెలిపారు.

ఇసుక నిల్వలు సీజ్

పెబ్బేరు రూరల్: వనపర్తి మండలంలోని అచ్యుతాపురం శివారులో అక్రమంగా నిల్వ చేసిన ఇసుకను శనివారం సీజ్ చేసినట్లు వనపర్తి రూరల్ ఎస్ఐ జలంధర్‌రెడ్డి తెలిపారు. సుమారు 80 ట్రిప్పుల ఇసుకను నిల్వ చేసినట్లు విశ్వసనీయ సమాచారం మేరకు రెవెన్యూ అధికారులతో కలిసి పరిశీలించామని, ఎలాంటి అనుమతులు లేకపోవడంతో సీజ్ చేశామని వివరించారు.